క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సుద్దమల్లలో హారతి తీసుకుంటున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనర సింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్ శర్మ, లక్ష్మణస్వామి, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



రుద్రవరం:మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు వారణాసి గోపీ శర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్యపూజలు గావించారు. అనంతరం మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కొనసాగుతున్న సెపక్‌తక్రా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జరుగుతున్న జాతీయ సెపక్‌తక్రా జాతీయ స్థాయి పోటీలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. శనివారం జరిగిన క్రీడలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పోర్టో గౌరవాధ్యక్షులు, వైఎస్సార్ కడప జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ ఒంటేరు శ్రీనివాసరెడ్డి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ షేక్షావలిరెడ్డి పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం జీఎల్ ప్రమోషన్ల గురించి చర్చించాలని సెపక్‌తక్రా సెక్రటరీ శ్రీనివాసులు, దండె నాగేంద్ర, ఏపీరెడ్డి తదితరులు వినతి పత్రం అందజేశారు.

నేటి నుంచి భద్రావతి, భావనారుషి కల్యాణోత్సవం

నంద్యాల(వ్యవసాయం): సంజీవనగర్‌లోని శ్రీభద్రావతి భావనారుషి ఆలయంలోని కల్యాణ మండపంలో ఆదివారం నుంచి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని పద్మశాలీయ సంఘం నాయకులు తెలిపారు. శనివారం స్థానిక కల్యాణ మండపంలో కల్యాణ మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు గాజుల వేణు మాట్లాడుతూ 2న బిందె సేవ కార్యక్రమం, 108 కలశాలతో స్వామి వారికి కుంబాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమం, స్వామి వారి ఇంటి ఆడపడచు శ్రీపద్మావతిదేవి అమ్మవారికి గుడిపాటిగడ్డలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర దేవాలయానికి పట్టువస్త్రాల సమర్పణ, 3న రుద్ర, నవగ్రహ, గణపతి, సుదర్శన మహాయాగం జరిపిస్తామని చెప్పారు. 4న స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భీమునిపల్లె వెంకటసుబ్బయ్య, చేపూరి మురళీ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): మండలంలోని అర్హులైన వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడ్డ కులాల వారి నుంచి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన మండలంలోని బ్యాంకు బ్రాంచ్‌ల వారీగా కేటాయించడిన కార్పొరేషన్లకు సంబంధించి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. 21–60 సంవత్సరాల మధ్య వయస్సు గల బీసీ, ఈబీసీ వారు అర్హులని, తెల్లరేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఒక రేషన్‌కార్డు ద్వారా ఒక్కరు మాత్రమే లబ్ధి పొందేందుకు అర్హులన్నారు. వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు పరిశ్రమలు, చిన్నతరహా వ్యాపారం, సేవలు, రవాణా విభాగం వంటి సెక్టార్‌కు సంబంధించిన యూనిట్లకు సబ్సిడీ మంజూరు చేస్తారని వెల్లడించారు. అర్హత గల వారు httpr://apo bmmr.apcfrr.in వెబ్‌సైట్‌లో 7వ తేదీ లోగా పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య

- పేద విద్యార్థులతో చెలగాటమా?
- విద్యార్థులకు అండగా 'ఫీజు పోరు'
- ఈ నెల 5న భారీ ర్యాలీతో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన
- విద్యార్థులు, తల్లిదండ్రులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే గంగుల పిలుపు



'ఫీజు పోరు' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఎన్నికల ముందు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కాక నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న ఫీజు పోరు పోస్టర్లను నియోజకవర్గ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే రెట్టింపు సంక్షేమం అందజేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అటకెక్కించడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడిందన్నారు. నాలుగు దఫాలుగా బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ 3,900 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు చెల్లించలేదని అనేక విద్యాలయాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. బకాయిపడిన ఫీజులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న నంద్యాలలో కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తాన్నారు. ఇందుకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిషోర్‌రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, చెన్నయ్య, రమేష్ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి..

జిల్లాలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ముస్లీం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చాగలమర్రికి చెందిన షబ్బీర్ హుసేన్, మైనార్టీ రాష్ట్ర నాయకుడు బాబులాల్‌తో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో మాజా ఎమ్మెల్యే గంగును కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.



గంగుల బిజేంద్రారెడ్డిని సన్మానిస్తున్న ముస్లింమైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు

'ఫీజు పోరు'ను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

బొమ్మలసత్రం: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఈనెల 5వ తేదీన వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ఫీజు పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తన నివాసంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం శిల్పా రవి మాట్లాడుతూ బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు రూ.3,900 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇళ్లకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా తమ పార్టీ తలపెట్టిన పోరుబాటలో విద్యార్థులు, సంఘాల నాయకులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సన్నల సాయిరామ్‌రెడ్డి, పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ మేరువ సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్,ఆఫీషియల్ స్పోక్‌పర్సన్ అనిల్ అమృతరాజ్, ఇంటలెక్షువల్ ఫోరమ్ అధ్యక్షుడు షేక్ రసూల్ ఆజాద్, నాయకులు డాక్టర్ శశికళారెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పున్నా శేషయ్య, కిరణ్, విజయభాస్కర్, కలామ్‌బాషా పాల్గొన్నారు.

పింఛన్ కోసం తప్పని ఇబ్బందులు



అల్లూరు గ్రామ సచివాలయంలో దివ్యాంగ బాలుడితో వేలిముద్ర తీసుకుంటున్న వీఆర్‌ఓ

ఉయ్యాలవాడ : 1వ తేదీ వచ్చిందంటే సామాజిక ఫించన్ లబ్ధిదారులలో వణుకు పుడుతోంది. ఎక్కడికి వెళ్లి ఫించన్ తీసుకోవాలో అనే ఆందోళన వారిని వేధిస్తోంది. అధికారులు మాత్రం తొలిరోజు 90 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెబుతున్నారే తప్పా వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా సంక్షేమం, పాలన అందిస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిపోయాయి. ఇళ్ల వద్దకే ఫించన్ల పంపిణీ మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే జరుగుతోంది. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులందరినీ ఒక చోటుకు పిలిపించి అక్కడే అందజేస్తున్నారు. రచ్చబండలు, చెట్ల కింద, కార్యాలయాల్లోనే అధికారులు పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి వృద్ధులు, వికలాంగుల తిప్పలు వర్ణణాతీతం.

నిబంధనల మేరకే మేటీ గ్రూపులను నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అమానుల్లా

గోస్పాడు: నిబంధనల మేరకు ఉపాధి హామీ పనుల్లో మేటీ గ్రూపులను నమోదు చేయాలని ఎంపీడీఓ అమానుల్లా తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహించడానికి ప్రభుత్వం మేటీ గ్రూపులను రిజిస్ట్రేషన్ చేసేందుకు నిబంధనలు అమలు చేసిందన్నారు. వచ్చే ఏడాదికి అవసరమైన పనుల గుర్తింపు, సగటు వేతనం రూ.300 వచ్చేలా కూలీలకు కొలతలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధిత గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లు అవగాహన కల్పించి చేపట్టే పనులను సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగజ్యోతి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడి, శ్రమ

- రైతులకు లాభసాటిగా ఆవాల సాగు
- తక్కువ కాలపరిమితిలో చేతికొచ్చే పైరు




ఎం.చింతకుంట్ల సమీపంలో పూత దశలో కళకళలాడుతున్న ఆవాల పైరు

గోస్పాడు: పెట్టుబడి తక్కువతో రైతులకు ఎంతో లాభదాయకంగా ఆవాల పంట నిలుస్తుంది. దీంతో ప్రతి ఏడాది జిల్లాలోని రైతులు రబీ సాగు కింద జిల్లాలో పలు చోట్ల ఆవాల పంటను సాగు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని నంద్యాల, శిరివెళ్ల, గోస్పాడు, దొర్నిపాడు, మండలాల పరిధిలో ఎక్కువ భాగం కాగా మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో అరకొరగా సాగు చేశారు. జిల్లాలో 1,775 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా 1,265 హెక్టార్లలో పైరు సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆవాల పైరు పూతదశలో ఉండటంతో ఆయా ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. నంద్యాల, గోస్పాడు మండల పరిధిలో అధిక శాతం కనుచూపు మేర పంట సాగవడంతో నేలకు పచ్చని రంగేసినట్లు గోచరిస్తోంది.

తక్కువ సమయం, ఖర్చు తక్కువతో సాగు...


ఆవాలు పంటను తెగుళ్లు, చీడ పీడలు పెద్దగా ఆశించవు. పైరుకు కూడా మందులను ఒకటి, రెండు మోతాదులకు మించి పిచికారీ అవసరం ఉండదని వ్యవసాయాదాకారులు పేర్కొన్నారు. పంట పెరగడానికి సేంద్రియ ఎరువులు కూడా తక్కువ గానే ఉపయోగిస్తారు. కాబట్టి పెట్టుబడి తక్కువగా ఉంటుంది. పైరు కాలపరిమితి 90 నుంచి వంద రోజులు కావడం, సాగుకు రైతులకు శ్రమ, పెట్టుబడి ఖర్చులు ఎకరానికి రూ. 5నుంచి రూ.ఆరు వేలకు మించి కాదంటున్నారు. బాగా పండితే ఎకరానికి రెండు నుంచి నాలుగైదు క్వింటాల వరకు దిగుబడి వస్తుంది. క్వింటా ధర రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. దీంతో ఆదాయం బాగుండటంతో ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు.

శ్రమ తక్కువ



ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేశాను.ఈ సారి వరికి అనుకున్న దిగుబడులు రాక, సరైన ధర లేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రబీలో రెండవ పంటగా వరి వేయాలనుకున్నాం. కానీ ఇప్పటికే ధర లేకపోవడంతో పాటు ఉన్న ధాన్యాన్ని విక్రయించేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. దీంతో పది ఎకరాల్లో ఆవాల పంట వేశాను. ఈ పంట సాగుకు పెద్దగా శ్రమ లేకపోగా, పెట్టుబడి ఖర్చులు అంతంత మాత్రంగానే ఉంటుంది. పంటకు నీళ్లు కూడా అవసరం లేదు. ఆవాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో సాగు చేశా. - నాగేశ్వరరెడ్డి, రైతు

పంట మార్పిడితో భూసారం వృద్ధి



పంట మార్పిడి చేస్తే భూమిలో పోషకాలు సమృద్ధిగా అందుతాయి. నాణ్యమైన ఉత్పత్తులు పెరిగి దిగుబడులు రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. రైతులు ఒకే రకమైన పంటలు పండిస్తూ సరైన దిగుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఆవాల సాగు రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. పైరు సాగు అనంతరం రైతులు పొలంలో సేంద్రియ ఎరువులను వాడితే మంచి ఫలితాలు ఉంటాయి.

-మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

విద్యార్థులకు అనుకూలంగా పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ

నంద్యాల: ప్రభుత్వ ఆదేశాలననుసరించి విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పాఠశాల పునర్ వ్యవస్థీకరణపై సమీక్ష నిర్వహించారు. డీఈఓ జనార్దన్ రెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క విద్యార్థీ నష్టపోకుండా విద్యార్థులకు అనుకూలంగా ప్రక్రియను చేపట్టాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతిలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. భవనాలు, ఇతర మౌలిక వసతులు వృథా కాకుండా వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొనేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

ట్యాంకు కూల్చివేత

దొర్నిపాడు:మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకును శనివారం కూల్చివేశారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి శిథిలావస్థలో ఉండటం వల్ల స్థానికంగా నివాసం ఉండే ప్రజలు భయాందోళన చెందేవారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు కూల్చివేసినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 2వ తేదీన గుంటూరు జిల్లా మంగళగిరి స్పెషల్ పోలీసు బెటాలియన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్ అథ్లెటిక్స్ మీట్ దివ్యాంగుల క్రీడా పోటీల్లో నంద్యాల జిల్లా తరపున భరత్, అనీఫ్‌ఖాన్, దుర్గారావు, శ్రీకాంత్, సోమేశ్వరరెడ్డి, విశ్వనాథ్, మహేష్ పాల్గొంటారని జిల్లా పారా స్పోర్ట్స్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రమణయ్య తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ జనవరి 25వ తేదీన జరిగిన జిల్లాస్థాయి దివ్యాంగ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచారన్నారు. వందమీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాల్లో పాల్గొంటారని చెప్పారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): పట్టణ సమీపంలోని ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల వాహన చోదకులకు, విద్యార్థులకు శనివారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటారు వాహన తనిఖీ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించామన్నారు. సీఐ మల్లికార్జున గుప్త, కళాశాల డీన్ అశోక్‌కుమార్, హెచ్‌ఓడీ డాక్టర్ తిరుపతిరెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జ్ హర్షవర్ధన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ పెట్రోలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): దివ్యాంగులు ఉపయోగించే మూడు చక్రాల వాహనాలకు సబ్సిడీ పెట్రోలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధర శెట్టి శనివారం ఓ ప్రకటనలో కోరారు. దివ్యాంగులకు సబ్సిడీ పెట్రోల్ అందిస్తామన్న ప్రభుత్వం ఇంత వరకు చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ఇది వరకే వికలాంగుల సంక్షేమ శాఖ కర్నూలు వారికి మూడు విడతలుగా వినతి పత్రాలు ఇచ్చామని, అయినా అధికారులు స్పందించడం లేదన్నారు.



ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, పీపీ నాగిరెడ్డి

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

గోస్పాడు: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ విశాలాక్షి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. గ్రామంలో ప్రజలందరూ ఐకమత్యంతో ఏర్పాటు చేసుకున్న ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి రోజు గంగా నయనం, గోపూజ, గణపతిపూజ, స్వస్తి, పుణ్యాహావాచనం, పంచగవ్య కరణం, నాంది మాతృక పూజ, రక్షధారణ, దీక్షా, రుత్విగరణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ప్రధాన కలశ స్థాపనలు, యంత్రాభిషేకాలు, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగంతో పాటు ప్రదోష కాల పూజలు, మూలమంత్ర జపాదులు, అంకురార్పణం, అగ్నిప్రతిష్టాపన, దీక్షా హోమ, అవాసాది హోమాలు, జలాదివాసం, మహామంగళ హారతి నిర్వహించారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర చైర్మన్ పీపీనాగిరెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శివరామిరెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

నంద్యాల(వ్యవసాయం): నంది రైతు సమాఖ్య క్యాలెండర్లను మాజీ ఎమ్మెల్యే శిల్పారవి స్వగృహంలో శనివారం ఆవిష్కరించారు. శిల్పారవి మాట్లాడుతూ నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో గత 25 ఏళ్లుగా రైతులకు సలహాలు, సూచనలు అందివ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పీపీ మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఓబులపతి, రఫీ, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో పేదలకు ఒరిగిందేమీ లేదు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేదలకు ఒనగూరిన ప్రయోజనమేమీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధులు తేవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టుకు దశల వారిగా నిధులు విడుదల చేస్తామని చెప్పడం, విశాఖ ఉక్కుపై తూతూ మంత్రంలా విడుదల చేయడం, ప్రత్యేక హోదాపై ఏ మాత్రం చర్చించకపోవడం దారుణమన్నారు. ప్రజలపై వంట గ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ భారాలు మోపడమే కాక రాష్ట్రానికి బడ్జెట్ కేటాయించకపోవడం విచారకరమన్నారు. ఆశించినన్ని నిధులు కేటాయించకపోవడంతో రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు అనుమానమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉన్న వాడికి ఊడిగం చేసేలా ఉందని మండిపడ్డారు.

కొనసాగుతున్న వరి నాట్లు




కుందూ పరివాహక ప్రాంతంలో వరి నాట్లు వేస్తున్న దృశ్యం

మండలంలో కేసీ, కుందూ పరివాహక ప్రాంతాల్లో వరి నాట్లు ఇంకా కొనసాగుతున్నాయి. గతేడాది రబీలో 98 హెక్టార్లు సాగు చేయగా ఈ సారి 195 హెక్టార్ల వరకు వరి సాగైనట్లు అధికారులు తెలిపారు.ఈ నెల 15 వరకు వరకు వరి నాట్లు వేసుకోవచ్చని మరో 50 హెక్టార్లు పెరిగే అవకాశం ఉందన్నారు. కాని పంట చేతికి రావాలంటే మార్చి నెలాఖరు వరకు సాగు నీరు రావల్సి ఉంది. అంతవరకు నీటి వదుదలపై అధికారుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-దొర్నిపాడు

గ్రామసభలకు స్పందన కరువు

- ఉపాధి కూలీలు వ్యవసాయ పనుల్లో
- ఉపాధి సిబ్బంది గ్రామ సచివాలయాల్లో
- టీడీపీ నాయకులతో సభలు ముగించిన అధికారులు



బోడెమ్మనూరు సచివాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎదుటనే రికార్డులను తనిఖీ చేస్తున్న ఏపీఓ



మాయలూరులో గ్రామసభలో కేవలం ఉపాధి సిబ్బంది మాత్రమే హాజరైన దృశ్యం

ఉయ్యాలవాడ : 2023–24 ఆర్థిక సంవత్సరం సంబంధించిన ఉపాధి హామి పనుల 18వ విడత సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్ గ్రామసభలకు రైతులు, ప్రజలు, కూలీల నుంచి స్పందన కరువైంది. శనివారం జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఏడాదిలో నిర్వహించిన పనులకు వెచ్చించిన నిధులపై మాయలూరు, బోడెమ్మనూరు గ్రామ సచివాలయాల్లో ఉపాధి సిబ్బందితో కలిసి డీఆర్పీలు జ్ఞానేశ్వరరావు, బాలకొండయ్య గ్రామసభలు నిర్వహించారు. నిధుల వ్యయంపై ప్రతి గ్రామంలో నాలుగు రోజుల పాటు సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఉపాధి కూలీలకు సంబంధించిన వేతనాలు సక్రమంగా పొందారా లేదా, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై రికార్డుల్లో నమోదైన ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించ వలసి ఉంది. అనంతరం గ్రామసభల్లో గ్రామంలో చేపట్టిన పనుల వివరాలు డీఆర్పీలు వెల్లడించాలి. అయితే వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండటంతో కూలీలు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామ సభల్లో మాయలూరు గ్రామంలో వ్యయం చేసిన రూ.97.75 లక్షలు, బోడెమ్మనూరులో రూ. 57 లక్షలు నిధుల వ్యయంపై ప్రజలకు వివరించడానికి ఎవ్వరూ హాజరు కాకపోవడంతో డీఆర్పీలు టీడీపీ గ్రామ నాయకులతో సభలను మమ అనిపించారు.